RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 305 | బుధవారం 22 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బత్తుల లక్ష్మీనారాయణ | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా...

## కేసీఆర్ మరో కీలక సమావేశం ఏర్పాటు

**ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశం**

**పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా భేటీ**

**భవిష్యత్ పోరాటాలకు శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్**

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా, పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ఈ భేటీ జరగనుంది.పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కేసీఆర్ ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని రీ-ఆర్గనైజ్ చేసే దిశగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జెడ్పీ మాజీ చైర్మన్లను ఆహ్వానించారు.రాష్ట్రంలో మారుతున్న



రాజకీయ పరిణామాల నేపథ్యంలో, భవిష్యత్ పోరాటాల కోసం శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా రజతోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా ఒక భారీ యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

## తెలంగాణ జాగృతిలో చేరిన తెలంగాణ టీడీపీ నేత

**తెలంగాణ టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ అహ్మద్**

**జాగృతి కండువా కప్పి ఆహ్వానించిన కవిత**

**త్వరలో పార్టీని ప్రకటించనున్న కవిత**

తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకుడు సయ్యద్ అహ్మద్ మంగళవారం తెలంగాణ జాగృతిలో చేరారు. ఆయన రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడిగా ఉన్నారు. ఈరోజు సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో తన అనుచరులతో కలిసి ఆయన తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి కవిత జాగృతి కండువా కప్పారు.కల్వకుంట్ల కవిత తన తెలంగాణ జాగృతి సంస్థను త్వరలో రాజకీయ పార్టీగా మార్చబోతున్నారు. అయితే పేరును ఇంకా ఖరారు చేయలేదు. ఈ నెల 25వ తేదీన ఆమె తన పార్టీని ప్రకటించనున్నారు. తెలంగాణ జాగృతి పార్టీ, తెలంగాణ రాష్ట్ర సమితి పేర్లను ఆమె పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది



## మావోయిస్టుల్లా బీఆర్ఎస్ కూడా కనుమరుగవుతుంది: రఘునందన్ రావు

**జగిత్యాల నుంచి జైత్రయాత్ర ప్రారంభమన్న బీఆర్ఎస్‌కు బీజేపీ ఎంపీ కౌంటర్**

**కేసీఆర్ హయాంలో అవినీతి జరిగిందని కవిత చెప్పారన్న రఘునందన్ రావు**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ బంధం వీణావాణీల వంటిదని చురక**



గతంలో జగిత్యాల నుంచి జైత్రయాత్ర చేసిన నక్సలైట్లు ఆపై మావోయిస్టులుగా మారి కనుమరగయ్యారని, అలాగే బీఆర్ఎస్ కూడా కనుమరుగవుతుందని తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. జలదృశ్యంలో టీఆర్ఎస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌గా మారిన ఆ పార్టీ అదృశ్యం కావడం ఖాయమని అన్నారు. జగిత్యాల నుంచే తమ జైత్రయాత్ర ప్రారంభం కాబోతుందన్న బీఆర్ఎస్ అధినేత వ్యాఖ్యలకు రఘునందన్ రావు కౌంటర్ ఇచ్చారు.
కేసీఆర్ హయాంలో అవినీతి జరిగిందని స్వయంగా ఆయన కూతురు కవిత చెప్పారని ఆయన గుర్తు చేశారు. కవితను అప్రూవర్‌గా మార్చి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు తిట్లను మానుకుని ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. నిన్న జరిగిన బహిరంగ సభలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరూ తుపాకీ రాముడి మాటలే మాట్లాడారని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ బంధం వీణావాణిల వంటిదని అన్నారు. వారు పైకి వేరుగా కనిపిస్తున్నప్పటికీ, రెండు పార్టీలు ఒకటేనని విమర్శించారు.

# అభివృద్ధి, సంక్షేమం, ఎన్డీఏతోనే సాధ్యం

**తమిళనాడులో చంద్రబాబు ఎన్నికల ప్రచారం**

**చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి మీడియా సమావేశం**

అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాల కల్పన జరగాలంటే అది ఒక్క ఎన్డీఏతోనే సాధ్యమని, తమిళనాడు రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురాగల శక్తి ఎన్డీఏ కూటమికి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల రాష్ట్రం ఎలా నష్టపోతుందో వివరించారు.




2



## దశాబ్దాల నాటి గోర్ఖా సమస్యకు పరిష్కారం చూపుతాం

2

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థను టీడీపీ ప్రభుత్వం దెబ్బతీస్తోంది

**గత రెండేళ్లుగా ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రం వెనుకబాటులో ఉందని వెల్లడి**

**ఉపాధి హామీ వ్యయం, పనిచేసిన కుటుంబాల సంఖ్య తగ్గాయని ఆరోపణ**

**అవినీతిపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శ**



2

# వెయ్యి ఏండ్లయినా బీఆర్ఎస్ మారదు"

**-కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు**

**-ప్రజల సమస్యలు పక్కనబెట్టి బలప్రదర్శన రాజకీయాలు, కవిత ఆగ్రహం**

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 21:-
హైదరాబాద్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "వెయ్యి ఏండ్లయినా బీఆర్ఎస్ పార్టీ మారదు" అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయంలో ప్రజలనే తప్పుబడుతోందని ఆరోపించారు.
జగిత్యాల సభలో తెలంగాణ ఉద్యమకారుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదని, ఉద్యమానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. జీవన్ రెడ్డి తెలంగాణకు వ్యతిరేకిగా వ్యవహరించారని, ఉద్యమ నాయకత్వంపై రెండుసార్లు పోటీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకత్వం మౌనం పాటించడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించిన కవిత, మహిళా బిల్లు, జనగణన, డీలిమిటేషన్ వంటి కీలక అంశాలపై స్పందించలేదని విమర్శించారు. మహిళల పట్ల గౌరవం లేదని కూడా ఆరోపించారు.రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు ప్రజల సమస్యలను పక్కనబెట్టి బలప్రదర్శన రాజకీయాలకు దిగుతున్నాయని, ఒకటి ఉత్తికథలు చెప్తే మరొకటి పిట్టకథలు చెప్తోందని వ్యాఖ్యానించారు. ప్రజా కేంద్రిత రాజకీయాల కోసం తాము ఈనెల 25న కొత్త రాజకీయ శక్తిగా ముందుకు వస్తున్నామని ప్రకటించారు.ముఖ్యమంత్రి వ్యాఖ్యలు కోర్టు తీర్పులను ప్రభావితం చేసేలా ఉన్నాయని, రాజ్యాంగ సంస్థలను అవమానించేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం కేసు విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు.రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎవరు అధికారంలో ఉండాలో ప్రజలే నిర్ణయించాలన్నారు. రైతులకు సకాలంలో సహాయం అందడం లేదని, పేదల ఇండ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని విమర్శించారు. ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం విఫలమైందని అన్నారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సంస్థను ప్రైవేటీకరించే ప్రయత్నాలు



జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.
ఈనెల 25న నిర్వహించే పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి ఆశీర్వదించాలని కవిత పిలుపునిచ్చారు. సభకు వచ్చే కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసు, అధికార యంత్రాంగాన్ని కోరా

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
బుధవారం 22 ఏప్రిల్ 2026

# అభివృద్ధి,సంక్షేమం,ఎన్డీఏతోనే సాధ్యం

**రాహుల్, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?**

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల విషయంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశాయని చంద్రబాబు ఆరోపించారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని డీఎంకే, కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు భావిస్తున్నాయి. కానీ వాస్తవానికి వారు ఈ దేశ మహిళలను, దక్షిణాది రాష్ట్రాలను ఓడించారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం పెంచాలనేది కేంద్రం ప్రతిపాదన. ఆ పెరిగిన సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయి. దీనివల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు. ఈ ఫార్ములా కంటే మెరుగైనది మరొకటి ఉంటుందా? అయినా, కేవలం రాజకీయ కారణాలతో ఈ రెండు బిల్లులను అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?" అని చంద్రబాబు ప్రశ్నించారు.

"సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేను దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఎందుకు ఆలోచిస్తాను? నేను దక్షిణాది వైపే మాట్లాడుతున్నాను. 2001లో వాజ్‌పేయి హయాంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రతిపాదన వస్తే, అది దక్షిణాదికి నష్టమని చెప్పి నేనే ఆపించాను. ఈ విషయాన్ని ఇండియా కూటమి పార్టీలు గుర్తుంచుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

**తమిళనాడుకు గత వైభవమేదీ?**

ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉన్న చెన్నై, ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడలేకపోతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "తమిళనాడులో అభివృద్ధి ఆగిపోయింది. శాంతిభద్రతలు క్షీణించాయి. మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ వాడకం పెరిగిపోయాయి. గతంలో తమిళనాడుకు గొప్ప చరిత్ర ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఉందా? జరిగిన కొద్దిపాటి అభివృద్ధి కూడా కేంద్ర నిధుల వల్లే. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, చెన్నై-బెంగళూరు-అమరావతి హైస్పీడ్ రైలు కారిడార్ వంటివి కేంద్రం చొరవే. డీఎంకే లాంటి పార్టీల వల్ల రాష్ట్రం వెనుకబడుతోంది" అని విమర్శించారు.

**ఇప్పుడు ఏపీని చూడండి**

కేంద్ర సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి పథంలో పయనిస్తోందో చంద్రబాబు వివరించారు. "దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. డబ్బులు లేకున్నా, ల్యాండ్ పూలింగ్ వంటి వినూత్న పద్ధతిలో రాజధాని నిర్మిస్తున్నాం. ఇదంతా కేంద్రం సహకారంతోనే సాధ్యమైంది. తమిళనాడులోనూ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

**భాషా రాజకీయాలు వద్దు**

ప్రధాని మోదీపై వ్యతిరేకతతో భాషాపరమైన బేధాలు సృష్టించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. "మాతృభాషను గౌరవించాలి, కానీ ఇతర భాషలపై ద్వేషం వద్దు. హిందీని కేంద్రం జాతీయ భాషగా ప్రకటించలేదు. ప్రధాని మోదీ సైతం మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని చెబుతున్నారు. భాష పేరుతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు" అని అన్నారు. నదుల అనుసంధానం ద్వారా తమిళనాడు నీటి కష్టాలు తీరతాయని, అది ఎన్డీఏతోనే సాధ్యమని తెలిపారు. తిరువళ్లువార్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎందరో మహనీయులు పుట్టిన ఈ గడ్డపై ప్రజలు పురోగామి ఆలోచనలతో ఎన్డీఏకు మద్దతివ్వాలని కోరారు

# తమిళనాడులో ముగిసిన ఎన్నికల ప్రచార గడువు...

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార హోరుకు మంగళవారం సాయంత్రం 6 గంటలకు తెరపడింది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల కీలకమైన "నిశ్శబ్ద సమయం" (సైలెన్స్ పీరియడ్) అధికారికంగా ప్రారంభమైంది. దీంతో బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రసంగాలకు ఫుల్‌స్టాప్ పడింది. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్‌లో 152 స్థానాలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 23న తమిళనాడులో ఒకే విడతలో పోలింగ్ జరగనుండగా, బెంగాల్ లో తొలి దశ పోలింగ్ జరగనుంది. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ పదవీకాలం మే 10న ముగియనుండటంతో, మార్చి 15న ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్, మే 4న ఓట్ల లెక్కింపు జరపనున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో, గత కొన్ని వారాలుగా రాష్ట్రంలో రాజకీయ పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేశాయి. అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, అన్నాడీఎంకే నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీటికి తోడు నామ్ తమిళర్ కట్చి, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలు కూడా స్వతంత్రంగా బరిలో నిలవడంతో ఈసారి చతుర్ముఖ పోటీ ఆసక్తికరంగా మారింది. మండుటెండలను సైతం లెక్కచేయకుండా అగ్రనేతలంతా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, భారీ బహిరంగ సభల్లో పాల్గొన్నారు.ప్రచారం ముగియడంతో, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియను నిర్ధారించేందుకు కఠినమైన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. తమిళనాడు ముఖ్య ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ ఈ మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం, ఏప్రిల్ 21 సాయంత్రం 6 గంటల నుంచి ఏప్రిల్ 23న పోలింగ్ ముగిసే వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి.

ఈ నిబంధనల ప్రకారం, బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచార సంబంధిత సమావేశాలను నిర్వహించరాదు. టెలివిజన్, రేడియో, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికలతో పాటు ఎస్ఎంఎస్‌లు లేదా ఇంటర్నెట్ ద్వారా ఎన్నికల సంబంధిత కంటెంట్‌ను వ్యాప్తి చేయడంపై పూర్తి నిషేధం విధించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశంతో సంగీత, నాటక ప్రదర్శనలు వంటి వినోద కార్యక్రమాలను నిర్వహించడం కూడా నిషిద్ధం. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.నియోజకవర్గంలో ఓటర్లు కాని రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు నిశ్శబ్ద సమయం ప్రారంభం కాకముందే ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు కళ్యాణ మండపాలు, హాస్టళ్లు, అతిథి గృహాలపై నిఘా కట్టుదిట్టం చేశారు. అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్లకు జారీ చేసిన వాహన అనుమతులు మంగళవారం సాయంత్రం 6 గంటల తర్వాత చెల్లవు. పోలింగ్ రోజున అభ్యర్థులకు పరిమిత సంఖ్యలో వాహనాలకు అనుమతి ఉంటుంది, వాటిని కూడా రిటర్నింగ్ అధికారులు నియంత్రిస్తారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి వాహనాలను అద్దెకు తీసుకోవడం లేదా ఉపయోగించడం పూర్తిగా నిషేధం. అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఇద్దరు వ్యక్తులతో మాత్రమే ఎన్నికల బూత్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. అక్కడ కూడా జనం గుమిగూడటానికి అనుమతి లేదు.

# ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధ కార్యాలయంలా పనిచేస్తోంది

ప్రధాని నరేంద్ర మోదీపై తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం స్పష్టత ఇచ్చారు. తాను ప్రధాని మోదీని 'ఉగ్రవాది' అని పిలవలేదని, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరించారు. మంగళవారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నెలకొన్న భయానక వాతావరణాన్ని ఉద్దేశించే తాను ఆ వ్యాఖ్యలు చేశానని తెలిపారు.

"మోదీ ఉగ్రవాది అని నేను అనలేదు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, సంస్థలను, ఏజెన్సీలను బెదిరించడానికి వాడుకుంటున్నారని చెప్పాను" అని ఖర్గే స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలతో సహా కీలకమైన వ్యవస్థలన్నీ రాజకీయ ఒత్తిడిలో పనిచేస్తున్నాయని, ఇది ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం (ఈసీ) కూడా స్వతంత్రంగా వ్యవహరించడం లేదని, బీజేపీకి అనుబంధ కార్యాలయంలా మారిపోయిందని విమర్శించారు.మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు ఎప్పుడూ మద్దతు ఇస్తోందని పునరుద్ఘాటించారు. అయితే, ఈ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాము బిల్లును కాదని, డీలిమిటేషన్‌ను తీసుకురావడాన్ని మాత్రమే వ్యతిరేకించామని తెలిపారు. ధనబలం, కండబలం, దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని బీజేపీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు

# దశాబ్దాల నాటి గోర్ఖా సమస్యకు పరిష్కారం చూపుతాం

పశ్చిమ బెంగాల్‌లోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ... గోర్ఖా వర్గ ప్రజలకు భారీ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దశాబ్దాల కాలం నాటి గోర్ఖా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన స్పష్టం చేశారు.గోర్ఖా ప్రజల మనోభావాలను, వారి ఆందోళనలను అర్థం చేసుకోగల ఏకైక పార్టీ బీజేపీయేనని, మరే ఇతర పార్టీ కూడా ఈ సమస్యను పరిష్కరించలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే గోర్ఖాల ముఖంలో ఆనందాన్ని చూస్తారని... వారు శాంతియుతంగా జీవించేలా పరిష్కారాన్ని గుర్తిస్తామని హామీ ఇచ్చారు.

అయితే, తన ప్రసంగంలో అమిత్ షా ఎక్కడా నేరుగా 'గోర్ఖాల్యాండ్' లేదా 'ప్రత్యేక రాష్ట్రం' అనే పదాలను వాడకపోవడం గమనార్హం. కేవలం 'సమస్య పరిష్కారం' అనే అంశంపైనే ఆయన దృష్టి సారించారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థను టీడీపీ ప్రభుత్వం దెబ్బతీస్తోంది

టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడంలో ఉపాధి హామీ పథకం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. చారిత్రకంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉండేదని, కానీ గత రెండేళ్ల టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శించారు. ఆమోదించిన లేబర్ బడ్జెట్, పథకం కింద పనిచేసిన కుటుంబాల సంఖ్య, మొత్తం వ్యయం వంటి అన్ని కొలమానాల్లోనూ పనితీరు గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు.ఈ ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోందని జగన్ తెలిపారు. గత రెండేళ్లుగా జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు మందగించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. "టీడీపీ కూటమి ప్రభుత్వం అవినీతి, సంపదపై ఉన్న యావతోనే నిమగ్నమై ఉంది. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టే సమయం వారికి లేదు" అని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను మార్చుకొని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కేరళలో ఘోర విషాదం...

పేలుడు ధాటికి భారీగా మంటలు ఎగసిపడి, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకోవడంతో కార్మికులు, స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.ప్రతి ఏటా మలయాళ నెల 'మాడం'లో పూరం నక్షత్రం రోజున త్రిస్సూర్‌లోని వడక్కునాథన్ ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆసియాలోనే అతిపెద్ద పండుగల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ వేడుకకు పది లక్షలకు పైగా భక్తులు హాజరవుతారు. ఈ ఉత్సవాల్లో బాణసంచా ప్రదర్శన చాలా ప్రత్యేకం. దీనికోసం సిద్ధం చేస్తున్న షెడ్‌లోనే ప్రమాదం సంభవించింది.ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులైన వైద్యులను రప్పిస్తామని ఆయన అన్నారు. పోలీస్, ఫైర్, ఆరోగ్య, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల సమన్వయంతో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం త్రిస్సూర్ మెడికల్ కాలేజీలో 13 మంది చికిత్స పొందుతున్నారని, వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. బాణసంచా నిల్వ, నిర్వహణలో భద్రతా లోపాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ విషాద ఘటనతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ ఉత్సవాలపై విషాద ఛాయలు అలుముకున్నాయి.

# దళిత మహిళపై దాడి.. స్పందిచని అధికారులు

**కావలి నియోజకవర్గం ప్రతినిది కె.శ్రీనివాసులు (శుభోదయం న్యూస్):**

కావలినియోజకవర్గంలోని బోగోలు మండలం పాత బిట్రగుంట అరుందతి పాళెంలో ఓ స్థల వివాదంలో ఇంట్లో మగవాళ్లు లేని సమయంలో దళిత మహిళలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేసిసారని, కేసు పెట్టినా పోలీసులు న్యాయం చేయలేదని బాధిత మహిళ బొడ్డు కొండమ్మ రాంబాబు తమ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్ నందు వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మా గ్రామంలో సుమారు 70 సంవత్సరాలకు పైగా అరుందతిలకు ప్రభుత్వం నివేశన స్థలాలకు కొరకు మూడున్నర సెంట్ల భూమి ఇచ్చిందన్నారు అయితే అది మా పూర్వీకులు దగ్గర నుంచి మా ఆధీనంలోనే ఉందన్నారు. అయితే మా పక్క స్థలాన్ని దావులూరి బోడయ్య,వెంకయ్య అనే వారు వాకా బాలకోటారెడ్డి,చిన కోటారెడ్డి వాళ్లకు అమ్మగా వారు పక్కనున్న మా స్థలాన్ని సైతం ఆక్రమించుకొన్నారని తెలిపారు. అయితే ఆ విషయాన్ని గత 15 సంవత్సరాలుగా రెవెన్యూ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. అయితే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా గ్రీవెన్స్ లో తీసుకెళ్లినట్లు తెలిపారు. అలానే ఈ విషయాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా న్యాయం చేయలేదని వాపోయారు.

అయితే గత రెండు రోజుల క్రితం మా ఇంట్లో మగవాళ్లు ఎవరూ లేని సమయంలో జెసిబి తీసుకొచ్చి సదును చేస్తుండగా అడ్డు బోయిన మా పైన మహిళలు అని కూడా చూడకుండా వాకా మహేశ్వర రెడ్డి,బాలకోటారెడ్డి, కోటా రెడ్డి, శంకర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు మిమ్మల్ని కులం పేరుతో దూషిస్తూ దాడి చేసారని ప్రత్యక్షంగా వారు దాడి చేసిన వీడియోలు కూడా ఉన్నాయన్నారు. దాడి జరిగిన విషయాన్ని బిట్రగుంట పోలీస్ స్టేషన్ కు వెళ్లి కేసు పెట్టినా పట్టించుకోలేదని తెలిపారు. సోమవారం ఎస్పీ ఆఫీస్ లో గ్రీవెన్స్ కు వెళితే అక్కడ కొందరు పోలీసులు మిమ్మల్ని ఎస్పీ మేడమ్ ను కలవనీయకుండా అడ్డుకున్నట్లు తెలిపారు.అయితే మా పై దాడి చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ను ప్రజాదర్బార్ లో కలిసి తామ గోడు వెళ్లబోసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డు ఉమ తదితరులు పాల్గొన్నారు.




# నారాయణస్వామి వార్షికోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి- : కొమ్మినేని వెంకట్రావు

**పామూరు మండల**



నారాయణస్వామి వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మండలంలోని మిట్టపాలెం గ్రామంనకు చెందిన కొమ్మినేని వెంకట్రావు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముండ్లమూరు మండలంలోని కంభంపాడు గ్రామంలో వెలసిన నారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీన వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు భక్తులందరూ పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఉదయం 9 గంటలకు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఎదురు నడవడం పూజా కార్యక్రమంతో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# మావోయిస్టుల్లా బీఆర్ఎస్ కూడా కనుమరుగవుతుంది: - రఘునందన్ రావు

అందుకే కేసీఆర్, రేవంత్ రెడ్డిలు ఒకరినొకరు కాపాడుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో ప్రధాని మోదీ తెలంగాణకు వస్తే బీఆర్ఎస్ వాళ్లు ఫుల్ పేజీ ప్రకటనలు ఇచ్చి ఆయన వార్తలు రాకుండా కుట్ర చేశారని ఆరోపించారు. ఇప్పుడు అదే రీతిలో పేపర్లో చెరి సగం వార్తలు రావాలని ఇద్దరూ డ్రామాలు ఆడారని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని సీబీఐకి అప్పగించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డిని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కంపెనీ మేనేజ్ చేస్తోందని ఆరోపించారు. ఈ కంపెనీకే మూసీ పనులను కూడా అప్పగిస్తున్నారని అన్నారు. కేసీఆర్ చేసిన లక్ష కోట్ల అవినీతిని కక్కిస్తామని రాహుల్ గాంధీ చేత చెప్పించిన రేవంత్ రెడ్డి ఆ దిశగా ఏమీచేయడంలేదని అన్నారు.

# బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలు..

**అరకు**



అరకు నియోజకవర్గం పరిధి డుంబ్రిగుడ మండలంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం..అరకులోయ మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిధి సూకురుగుడ గ్రామానికి చెందిన వంతల.త్రినాధరావు బైక్ పై డుంబ్రిగుడ వైపు వెళ్తున్నారు.ఈ క్రమంలో అరుకులో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురవ్వగా తీవ్ర గాయాలయ్యాయి.దీంతో స్థానికులు 108 అంబులెన్స్ సమాచారం అందించి అరకు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
బుధవారం 22 ఏప్రిల్ 2026

# చిగురిస్తున్న సాగు ఆశలు

## - 'జలధార'తో మారనున్న గంగచోళ్లపెంట రూపురేఖలు

గజపతినగరం: దశాబ్దాల నీటి కష్టాలకు చెక్ పడనుంది. ఎండిపోయిన భూముల్లో మళ్లీ పచ్చదనం పరుచుకోనుంది. గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామంలో అమలవుతున్న 'జలధార' పనులు స్థానిక రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం మట్టి పనులుగా కాకుండా, తమ భవిష్యత్తును మార్చే అభివృద్ధి యజ్ఞంగా రైతులు ఈ పనులను భావిస్తున్నారు.



**సమిష్టి కృషితో సాగు నీటి సంకల్పం**

బోనివాని చెరువు వద్ద మంగళవారం నాటికి 207 మంది వేతనదారులు ఉత్సాహంగా పనుల్లో నిమగ్నమయ్యారు. పూడికతీత పనులతో చెరువు గర్భం పెరుగుతుంటే, తమ కష్టాలు తీరుతాయన్న నమ్మకం వారి కళ్లలో కనిపిస్తోంది. సుమారు 19.65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును అభివృద్ధి చేయడం ద్వారా 400 ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందనుంది.

"గతంలో వర్షం కోసం ఆకాశం వైపు చూసేవాళ్లం. ఇప్పుడు చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుండటంతో మా పొలాలకు భరోసా దొరికినట్లయింది," అని స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అనుసంధానంతో జలకళ**

ఈ ప్రాజెక్టులోని ప్రధాన ఆకర్షణ చెరువుల అనుసంధానం. చంపావతి నది నుంచి ప్రవహించే జలాలు క్రమపద్ధతిలో సాగు భూములను తడిపేలా ప్రణాళిక రూపొందించారు.

చంపావతి నది - బద్ది చెరువు (38 ఎకరాలు - 300 ఎకరాల సాగు)

బద్ది చెరువు - బోనివాని చెరువు (19.65 ఎకరాలు - 400 ఎకరాల సాగు)

బోనివాని చెరువు - పోతలపూడి చెరువు (19.5 ఎకరాలు - 115 ఎకరాల సాగు)..ఇలా

ఈ గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ ద్వారా నీటి వృధా అరికట్టడమే కాకుండా, భూగర్భ జల మట్టం పెరిగి చుట్టుపక్కల బావుల్లో కూడా జలకళ రానుంది.

**రైతు ఆదాయానికి 'జలధార' భరోసా**

బోనివాని చెరువు అభివృద్ధి ద్వారా 160 రైతు కుటుంబాల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయి. కేవలం వరి పంటకే పరిమితం కాకుండా, నీటి లభ్యత పెరగడంతో రైతులు విభిన్న పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

**అపరాల సాగు:**

వరి కోత అనంతరం తేమ ఉండటంతో పప్పు ధాన్యాల సాగుకు అవకాశం పెరిగింది.అదనంగా 20 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ముగింపు

పూడికతీత ద్వారా వచ్చిన మట్టితో చెరువు కట్టలను బలోపేతం చేస్తుండటంతో, రాబోయే వర్షాకాలం నాటికి బోనివాని చెరువు నిండు కుండలా మారనుంది. నీటి కొరతతో కుదేలైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు 'జలధార' ఒక సంజీవనిలా మారి, గజపతినగరం మండల వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చబోతోంది.

# భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి

- విజయనగరం: జిల్లాలో కొనసాగుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రైల్వే లైన్లు మరియు జాతీయ రహదారుల భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించారు. నిర్దేశించిన గడువులోగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తోటపల్లి, తారకరామ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులపై సమీక్షించారు. రైల్వే ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ, విజయనగరం - సంబల్‌పూర్ మూడవ లైన్ పనులు, కొత్తవలస - విజయనగరం నాలుగో లైన్ మరియు ఖుర్దా రోడ్ - విజయనగరం మూడవ లైన్ పనులకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్లు, స్ట్రక్చర్ వ్యాల్యుయేషన్ రిపోర్టులు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులైన ఎన్ . హెచ్.-516దీ



(పెందుర్తి - బొబ్బిలి) మరియు ఎన్హెచ్-130 జణ (రాయ్‌పూర్ - విశాఖపట్నం) పనులకు భూసేకరణ అవార్డులు జారీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తయ్యేలా రెవెన్యూ మరియు రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఈ సమావేశంలో ఆదేశించారు. మున్సిపాల్టీల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం కోసం ప్రతిపాదించిన ఎస్టీపీలకు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్, డిఆర్వో సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు వివిధ శాఖల ప్రతినిధులు, తహసీల్దార్లు, ఎల్‌పి యూనిట్ల డిటిలు పాల్గొన్నారు

# విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) బాలికల వసతి గృహంలో ప్రవేశాలు

## - విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జి.చంద్రిక

- విజయనగరం: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జి.చంద్రిక ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం పట్టణంనందు తహశీల్దార్ ఆఫీస్ ప్రక్కన విభిన్న ప్రతిభావంతులైన బాలికల వసతిగృహం నిర్వహించబడుతున్నదని, ప్రస్తుతం 100 సీట్లకు 70 మంది విద్యార్థినులు వసతి పొందుటకు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు మరియు ఇంటర్ ఆపై చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన బాలికలకు ప్రభుత్వం కల్పించే వసతులు గురించి ఆమె వివరిస్తూ ఎంపికైన విద్యార్థినులకు ఉచిత భోజనం మరియు వసతి., కాస్మెటిక్ ఛార్జీలు, సంవత్సరానికి రెండు జతల యూనిఫాంలు మరియు నోట్ బుక్స్, వసతి గృహానికి సమీపంలో ఉన్న పాఠశాలల్లో ప్రవేశం ఉచితంగా అందించబడతాయని తెలిపారు. దరఖాస్తుతో పాటు ధ్రువీకరణ సదరం సర్టిఫికేట్: కనీసం 40% వైకల్యం కలిగి ఉండాలని, మీ సేవ లేదా గ్రామ సచివాలయం ద్వారా జారీ చేయబడిన కుల, ఆదాయ మరియు నివాస ధ్రువీకరణ పత్రాలు, బదిలీ సర్టిఫికేట్ (ం.జ) పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, స్టడీ సర్టిఫికేట్:కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, రేషన్ కార్డు మరియు ఆధార్ కార్డు నకళ్లు జత చేసి కార్యాలయంనకు పంపించాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు లేదా వారి తల్లిదండ్రులు విజయనగరం తహశీల్దార్ ఆఫీస్ ప్రక్కన ఉన్న విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహాన్ని నేరుగా సంప్రదించవచ్చునని, మరింత సమాచారం కోసం: ఫోన్ నంబర్: 9100685216 (మ్యాట్రిన్) ను సంప్రదించగలరని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జి.చంద్రిక కోరారు.

# ప్రతి చెరువును జియో టాగింగ్ చేయాలి

## -బుధవారం మండల స్థాయి, గురవారం నియోజకవర్గం స్థాయి సమావేశాలు నిర్వహించాలి

## -టెలికాన్ఫరెన్స్ లో స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి

విజయనగరం : జలధార జలహారతి లో భాగంగా ప్రతి గ్రామంలో గుర్తించిన చెరువుకు జియో టాగింగ్ చేయాలనీ జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో నున్న చెరువులకు, పుష్కరిణి చెరువులకు కూడా జియో టాగింగ్ జరగాలన్నారు. ఇప్పటికే పనులు జరుగుతున్న వాటిని కూడా జియో టాగింగ్ చేయాలన్నారు. మంగళవారం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జలధార-జలహారతి కార్యక్రమం పనులపై డివిజన్ వారీగా గ్రామ స్థాయి చెరువుల ప్రణాళిక పై రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు, ఎం.పి.డి.ఓ లతో సమీక్షించారు. చెరువుల పనులను అంచనా వేసేటప్పుడు అవసరమైన పనులకు మాత్రమే ప్రతిపాదనలు పెట్టాలని అన్నారు.

జలధార- జల హారతి విజయనగరం చెరువుల వరం అనే బ్యానర్ తో బుధవారం మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశాలకు నియోజకవర్గం ప్రత్యేకాధికారులు స్థానిక శాసన సభ్యులను ఆహ్వానించాలని, అలాగే నీటి సంఘాల అధ్యక్షులను, ఉపాధ్యక్షులను, ఎం.పి.టి.సి., జెడ్.పి.టి.సి లను ఆహ్వానించి చెరువుల జాబితాలను వారి ముందు పెట్టాలని, ఎందుకు వాటిని ప్రాధాన్యత పనుల్లో పెట్టేమో వారికీ వివరించాలని తెలిపారు. గురువారం నియోజకవర్గం స్థాయి లో శాసన సభ్యుల ఆధ్వర్యం లో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సమావేశాలకు చేసిన ఏర్పాట్ల పై సమీక్షించారు. మొదటిగా 215 గ్రామాల్లో ప్రతిపాదించిన 1679 చెరువులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని తెలిపారు. స్లుయిస్ పనుల కోసం గుర్తించి ప్రతిపాదించిన వాటి వివరాలను వెంటనే డ్వామా పి.డి. కి పంపాలని తెలిపారు. ఈ పనులు ఉపాధి హామీ నిధులతో చేపట్టడం జరుగుతుందని, అవసరమైన పనులను మాత్రమే ఎంపిక చేయాలనీ సూచించారు.

సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ మాట్లాడుతూ పెండింగ్ ఉన్న రీ సర్వే పనులను పూర్తి చేయాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల ముద్రణ, పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. పి.జి.ఆర్.ఎస్ వినతులను గడువు దాటకుండా పరిష్కరించాలని, అధికారులు లాగిన్ లో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, రీ ఓపెన్ అయిన



వినతులకు నాణ్యమైన సమాధానాలు అందించాలని తెలిపారు.

ఈ టి సి లో 3 డివిజన్ల ఆర్.డి.ఓ లు , ఇరిగేషన్ ఈ ఈ రమణ , జిల్లా పరిషత్ సి.ఈ.ఓ సత్యనారాయణ, డ్వామా ఐ.డి. శారద దేవి, ఎం.పి.డి.ఓ లు, తహసిల్దార్లు , ఇరిగేషన్ డి.ఈ. లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- పూసపాటిరేగ:



మండలంలోని కందివలస సమీపంలో దేవి మెస్ నడుపుతున్న చిక్కాల అనిల్ కుమార్( 29)అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు.పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హోటల్ వెనుక ఇంటిలో తన కుటుంబంతో పాటు నివసిస్తున్న అనిల్ మధ్యాహ్నం సమయంలో ఇంటిని శుభ్రం చేస్తుండగా మోటారుకు ఉన్న వాటర్ పైపుతో శుభ్రం చేస్తోండగా కరెంటు షాక్ తగిలి అపస్మారక స్థితిలోనే చేరుకున్నాడు.అయితే అపస్మారకస్థితిలో ఉన్న అతనిని ఆయన భార్య అనురాధ ,అతని నాన్న చిక్కాల బుజ్జిబాబు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు.మృతుడు తండ్రి బుచ్చిబాబు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గా ప్రసాద్ తెలియజేసారు.

# జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌ను వినియోగించుకోవాలి


## - జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

- విజయనగరం :

వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ 202627 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జీవో యం.యస్ నెం: 43 ను జారీ చేసిందని, జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకాన్ని వినియోగించుకొని ఆరోగ్య బీమా పొందాలని కోరారు. ఈ పథకం ప్రీమియం క్రింద రూ. 1250 www.cfms.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దుకు చెల్లించి లబ్ధి పొందవలసినదిగా తెలిపారు.

Head of Account: 8342`00`120`01`03`001`001, DDO Code: 2703 0802 003

ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఫొటోలు, జే పి జే ఫార్మాట్ లో సంబంధిత జిరాక్స్ కాపీలను, కలెక్టరేట్ లోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాల్సిందిగా సూచించారు.వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం ప్రీమియం రూ.2,500 కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ.1,250, ప్రభుత్వం తన వాటా రూ.1,250 చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టు, భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందనీ కలెక్టర్ తెలిపారు




# 17మందిపై బైండోవర్ కేసులు



- భోగాపురం: మండలం తహసిల్దార్ హరి వద్ద భోగాపురం మండలానికి చెందిన గతంలో బెల్ట్ షాపులు నిర్వహించి కేసులు నమోదైన 17మంది వ్యక్తులను మంగళవారం హాజరుపరిచారు. వీరికి అండర్ సెక్షన్ 129 ఆఫ్ బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ 2023 ప్రకారం మరలా బెల్ట్ షాపులు నిర్వహించి కేసులు నమోదైనచో లక్ష రూపాయల అపరాధ రుసుము చెల్లించుట లేదా జైలు శిక్ష అంగీకారంపై బైండోవర్ నమోదు చేశారు.

# అయిదాల సునీల్ ను అభినందించిన జిల్లా ఎస్పి పారితోష్ పంకజ్

జహీరాబాద్




రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పోలీస్ శాఖ వారం రోజుల పాటు నిర్వహించిన "అరైవ్ - అలైవ్" ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రత, వాహన దారులు అవలంబిస్తున్న నిర్లక్ష్యం పై పాటలు పాడి విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా జిల్లా ఎస్పి కార్యాలయంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు, జహీరాబాద్ మండలం రాయిపల్లి 'డి' గ్రామానికి చెందిన అయిదాల సునీల్ ని సంగారెడ్డి జిల్లా ఎస్పి శ్రీ పారితోష్ పంకజ్ ప్రశంసా పత్రం మరియు మెమెంటో ఇచ్చి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో యువత కు సందేశం, డ్రగ్స్ నిర్మూలన, బెట్టింగ్ యాప్ ల వాడకం, యువత ఆత్మ హత్యలకు సంబంధించి అయిదాల సునీల్ రచించిన పాటలు పాడి వినిపించగా జిల్లా ఎస్పి శ్రీ పారితోష్ పంకజ్ గారు అభినందించి ప్రశంసించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులతో పాటు సిఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# రైతులకు మామిడి తోటపై అవగాహన సదస్సు

జహీరాబాద్




జహీరాబాద్ మండలంలోని హోతి (బి )గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు మామిడి తోటపై శిక్షణ మరియు అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై, ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీలు, మామిడి తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్రూట్ కవర్ వినియోగం, హార్వెస్టింగ్ సమయంలో పాటించాల్సిన పద్ధతులు మరియు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై రైతులకు వివరంగా తెలియజేశారు. అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాముఖ్యత మరియు ఆయిల్ పామ్ సాగు గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి పండరి గారు, డివిజన్ వ్యవసాయ అధికారి బిక్షపతి ఎచ్ ఈ ఒ ,విట్టల్ హోతి( బి )గ్రామ సర్పంచ్ మచ్చేందర్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ కేవీకే నుండి డా. వరప్రసాద్ మరియు డా. శైలజ రైతులు మల్లేష్,అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి తోటలో పాటించాల్సిన సరైన నిర్వహణ పద్ధతులపై రైతులకు ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వబడింది.

# శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి

జహీరాబాద్



శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక దత్తగిరి కాలనీలో గల శ్రీ సరస్వతీ దేవి మందిరం నందు శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతి మరియు శంకరాచార్యుల పూజాదికాలు నిర్వహించి సుమారు 100 మంది మహిళలచే శంకరాచార్యుల అష్టోత్తర శతనామావళితో ప్రారంభించి శంకరాచార్యుల స్తోత్ర పారాయణాలు సౌందర్యలహరి శివానందలహరి తోటకాష్టకం గణేశ పంచరత్న స్తోత్రం గురువాష్టకం తదితర శంకర స్తోత్రాలన్నింటిని పారాయణం చేసినారు ఆ తరువాత మహా ప్రసాదం అన్నదానాన్ని కూడా నిర్వహించినారు.



# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా భావన ఋషి జయంతి వేడుకలు

జహీరాబాద్, ఏప్రిల్ 21

పద్మశాలి వంశ మూల పురుషుడు, సాక్షాత్తు శ్రీమన్నారాయణ అంశగా కొలువబడే శ్రీ భావనా ఋషి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జహీరాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నాడు స్థానిక మార్కండేశ్వర మందిరంలో భావనా ఋషి వేడుక్షలు అట్టహాసంగా జరిగాయి. వస్త్ర ప్రదాత, పద్మశాలీల ఆరాధ్య దైవమైన భద్రావతి భావనా ఋషి జన్మదినశీ పురస్కరించుకొని శ్రీ భక్త మార్కండేశ్వర మందిరంలో పండాల్ కృష్ణ సుప్రియ దంపతులద్వారా వేద పండితులైన శ్రీ వేణు భట్ గారి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ రుద్రాభిషేక కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్ధన్ , ప్రధాన కార్యదర్శి పద్మ రమేష్ బాబు,కోశాధికారి రంగా అరుణ్ కుమార్, సంఘం సభ్యులు కనుకుంట్ల నర్సింహులు , పండాల ప్రభు ,దోమల పండరి ,గద్దె వెంకటేశం,సగ్గశీ విజయ్ కుమార్ ,గడ్డం పాండు, కొంశెట్టిపల్లి లక్ష్మణ్ ,సగ్గశీ చంద్రశేఖర్ ,పశీడాల ప్రభు ,దారా మధు, ఎన్నంరఘు, గూడ జగన్ లతో పాటు కుల బాంధవులు పద్మశాలి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు పద్మశాలి సంఘం తీర్థ ప్రసాదాలను వితరణ చేసింది.

# సబ్ కలెక్టర్ ఉమ హరతి కి వినతి పత్రం సమర్పించిన టీఎస్ యుటిఎఫ్

నారాయణఖేడ్ న్యూస్

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి మర్యాద పూర్వకంగా కలసి అధిక వేడిమి దృష్ట్యా సెన్సస్ ట్రైనింగ్ క్లాసులు ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం1.00 వరకు నిర్వహించాలని అదేవిధంగా ఏప్రిల్ 23వ తేదీన పాఠశాల చివరి పని దినం మరియు పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఉన్నందున సెన్సెస్ ట్రైనింగ్ క్లాసులను ఏప్రిల్ 23వ తేదీకి బదులు ఏప్రిల్ 24వ తేది నుండి రెండో విడత ప్రారంభించాలని టిఎస్ యుటిఎఫ్ పక్షాన వినతిపత్రం ఇవ్వనైనది. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా మరియు మండల నాయకత్వం పాల్గొన్నారు.





# సంగారెడ్డి జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక

సంగారెడ్డి

మునిపల్లి మండలం టి జి ఆర్ ఎస్ & జూనియర్ కాలేజీ లింగంపల్లి జాహిరాబాద్ లో అండర్-14ఇయర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ సెలక్షన్ ట్రయిల్స్ నిర్వహించడం జరిగింది. వివిధ మండల్ నుంచి బాయ్స్ & గర్ల్స్ 50 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది ఫైనల్ సెలక్షన్ బాయ్స్ 18 ప్లయర్స్ & గర్ల్స్ 18 ప్లయర్స్ జిల్లా జట్టు ఎంపిక అయినారు..

జిల్లా జట్టు ఈ నెల ఏప్రిల్ 28 వ నుంచి 30 వరకు నిజాంబాద్ జిల్లా లో స్టేట్ టోర్నమెంట్ లో పాల్గొనడం జరుగుతుంది అని జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ కూన వేణు గోపాల్ ,వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ పీడీ రిటైర్డ్ రమాదేవి పీడీ ప్రకాష్ పీడీ జనరల్ సెక్రటరీ సరితా,జాయింట్ సెక్రటరీ సురేష్, వశిరం, సరితా, పార్వతి, ట్రెసారి నాగేష్ సీనియర్ ప్లయిర్ విజయ్ నాయక్ రవికుమార్ కోచ్ తరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు...

# వేదాంత వైభవం ఆదిశంకరాచార్య

**- దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు - ఘనంగా శంకరాచార్య జయంతి వేడుకలు**



న్యూస్ ఝరాసంగం/జహీరాబాద్:

ప్రపంచానికి అద్వైత వేదాంతాన్ని బోధించి, "బ్రహ్మ సత్యం జగత్ మిథ్య" అనే మహావాక్యంతో ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేసిన జగద్గురు ఆదిశంకరాచార్యులు హిందూ ధర్మ పరిరక్షణకు మార్గదర్శకుడని సంగారెడ్డి జిల్లా బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ అన్నారు. మంగళవారం శంకరాచార్య జయంతి సందర్భంగా దత్తగిరి ఆశ్రమంలోని ఆలయంలో గల అద్దాల మండపంలో ప్రతిష్ఠితమైన ఆదిశంకరాచార్యుల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శంకరాచార్యులు ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతం ద్వారా ప్రతి మనిషి తనలోనే పరమాత్మ స్వరూపాన్ని దర్శించగలడని, ఆత్మజ్ఞానం ద్వారానే మోక్ష మార్గం లభిస్తుందని అవధూత గిరి మహారాజ్ వివరించారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్ శ్రీ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ మాట్లాడుతూ.. శంకరాచార్యుల బోధనలు నేటి యువతకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ధర్మబద్ధమైన జీవనానికి ప్రేరణనిస్తాయని తెలిపారు. "భజగోవిందం" వంటి గ్రంథాల ద్వారా భక్తి, జ్ఞానం రెండింటినీ సమన్వయం చేసి సమాజానికి సరైన మార్గాన్ని చూపారని అన్నారు. వేద పాఠశాల విద్యార్థుల మంత్రోచ్చారణలు, పూజా కార్యక్రమాలతో ఆశ్రమం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, బి. కృష్ణ, బోయిని ఎల్లన్న, తుకారాం, గణేష్ స్వామి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఎంపిటీసి, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణం లోని ఓ ప్రైవేట్ హోటల్ లో మంగళవారం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యం లో జరిగిన ఈ సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి తో పాటు జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ , మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు, పఠాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం , పార్టీ కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తేనే విజయం సాధిస్తామని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచామని, మున్సిపల్ ఎన్నికల్లో సైతం అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామన్నారు. అయినప్పటికీ జిల్లాలో ఇంకా నాయకుల మధ్య సమన్వయం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాల ను చేపట్టినా, ఆ సందేశాన్ని, స్ఫూర్తి ని ప్రజల్లోకి తీసుకెళ్ళా ల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తల పైనే ఉంటుందన్నారు. కార్యకర్తల కు సముచిత స్థానం ఇవ్వాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుండే సన్నద్ధం కావాలి, పార్టీ నాయకుల మధ్య వర్గ పోరు ఉండొద్ద న్నారు. నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండటం సహజమే.. కానీ వర్గ పోరు వల్ల పార్టీ కి నష్టం జరుగుతుందన్నారు. డెబ్బై వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఇప్పటివరకు కేవలం ఆరోగ్య శాఖ లోనే దాదాపు ఇరవై వేల ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలు ను రైతు బంధు రూపం లో రైతులకు అందించామన్నారు. ఇందిరమ్మ




ఇళ్ల కార్యక్రమాన్ని గ్రామగ్రామాన విజయవంతంగా అమలవుతోందన్నారు . నలభై ఆరు లక్షల మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టామని, దేశం లో ఎక్కడా లేనివిధంగా డిజిటల్ హెల్త్ కార్డ్ లు అందించేందుకు కృషి చేస్తున్నా మని తెలిపారు. జహీరాబాద్, నారాయణ్ ఖేడ్ ఆసుపత్రులలో మరో 50 పడకలు అదనంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డి మెడికల్ కళాశాల లో భవిషత్తు లో పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నరు. సింగూరు ప్రాజెక్టు ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. 200 కోట్లతో సింగూరు ప్రాజెక్టు ను టూరిజం స్పాట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వం ముందుకెళ్తోంది అని అన్నారు. మహిళా బిల్లు కు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సెపరేట్ గా బిల్లు పెడితే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. డీలిమిటేషన్ ఉన్నా లేకున్నా మరోసారి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలునిచ్చారు. చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఎలా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా గెలిచాం, మన బలాబలాలు , లోపాల పై చర్చించుకోవాలి అన్నారు. వచ్చే ఎంపీ టీ సి , జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయం లో చర్చ జరగాలన్నారు. మూడేళ్ల కు పైగా మండలస్థాయి లో పనిచేసిన వారికి, జిల్లా స్థాయి లో పదవులు ఇచ్చి, వారి స్థానం లో మండలం లో కొత్తవారిని నియమించాలని సూచించారు. ప్రభుత్వం ఉన్నది కాబట్టి అభ్యర్థుల ఎంపిక లో పోటీ ఉందని, మన మధ్యే మనకే పోటీ వల్ల పార్టీ కి నష్ట జరుగుతుందన్నారు. మొన్న పార్లమెంట్ లో జరిగిన పరిణామాల ను, ఎందుకు మహిళా బిల్లు ను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందో , మహిళా బిల్లు విషయం లో బీజేపీ కుట్ర లను సైతం పార్టీ పరంగా చర్చ జరగాలి, ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ మాట్లాడుతూ మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 70% మంది సర్పంచ్ లు గా గెలిచారన్నారు. నాయకుల మధ్య సమన్వయం ఉం డాలి, అన్ని నియోజకవర్గాల్లో సమన్వయం తో పని చేయా లని పిలుపునిచ్చారు. దేశం లో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రం లో సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, సన్న బియ్యం, ఇందిరమ్మ గృహ పథకాల పట్ల ప్రజల్లో మంచి స్పందన వస్తోందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం రైతు బంధు ను కొనసాగిస్తుంది అని వివరించారు. రాష్ట్రం లో ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసే విప్లవాత్మక కార్యక్రమాన్ని ప్రభుత్వంచేపట్టబోతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో నూ కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని తెలిపారు. నీలం మధు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్రం లో జరిగిన కుల గణన ఆధారంగా వచ్చే ఎన్నికల్లో అన్ని కులాల కు సమ ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్పర్సన్ సునీతా పాటిల్, పిసిసి ప్రధాన కార్యదర్శులు తోపాజి అనంత్ కిషన్, చిన్నా ముదిరాజ్, నాయకులు శశికళా యాదవ్ రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారయణ, కొహీర్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

బుధవారం 22 ఏప్రిల్ 2026

# జగిత్యాల సభలో కేసీఆర్ గర్జన: మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే, జీవన్ రెడ్డికి కీలక బాధ్యత

## -జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ విమర్శల వర్షం, కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన బీఆర్ఎస్ అధినేత

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 21:-
నిన్న జరిగిన జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘాటైన ప్రసంగంతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తూ, ఆయనకు కీలక బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. జీవన్ రెడ్డి పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులవుతున్నారని తెలిపారు.జీవన్ రెడ్డి ధైర్యవంతుడు అని కొనియాడిన కేసీఆర్, ఆయనతో తాను చాలా కాలంగా స్నేహితులమని, పార్టీలు వేరైనా కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తుచేశారు. జగిత్యాల ప్రజల ఆశీర్వాదంతో జీవన్ రెడ్డి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయనకు విశేషమైన ప్రజాభిమానముందని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే పార్టీకి లాభం చేకూరుతుందని సర్వేలు వెల్లడించాయని తెలిపారు. ఆయన రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని చెప్పారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవన్ రెడ్డికి మంచి పదవి వస్తుందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కేసీఆర్, ప్రస్తుతం రాష్ట్రంలో పాలన పూర్తిగా దారితప్పిందని ఆరోపించారు. రైతులకు ఒకేసారి ఇవ్వాల్సిన రైతు బంధు సహాయాన్ని విడతలుగా ఇస్తున్నారని, యూరియా కోసం రైతులు యాప్‌లతో తిరుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయంలో రైతులకు విస్తృతంగా సహాయం అందించామని, వ్యవసాయ రంగానికి వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు.
రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దిగజారిందని, రియల్ ఎస్టేట్ రంగం క్షీణించిందని పేర్కొన్నారు. మంచినీటి సమస్యలు మళ్లీ తలెత్తుతున్నాయని, మున్సిపాలిటీలు మురికితో నిండిపోతున్నాయని విమర్శించారు. చేనేత కార్మికులు, ఉద్యోగులు, పింఛన్ దారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.తెలంగాణ ఉద్యమ కాలాన్ని స్మరించుకుంటూ, ఆ సమయంలో ఎదురైన కష్టాలను కేసీఆర్ వివరించారు. తెలంగాణ కోసం పోరాడినప్పుడు అనేక అవమానాలు ఎదుర్కొన్నామని, వాటిని తట్టుకుని రాష్ట్రాన్ని సాధించామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి సాధించామని చెప్పారు.
ప్రస్తుత ప్రభుత్వం కేంద్రం ఒత్తిడికి లోనై రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. పేదల ఇళ్ల కూల్చివేతలు, అభివృద్ధి పేరిట రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు చూసే చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు.
కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలను మోసం చేసిందని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటామని, తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞాన్ని మళ్లీ ప్రారంభిస్తామని ప్రకటించారు.జగిత్యాల నుంచే ఈ పునర్నిర్మాణ యాత్ర మొదలవుతుందని, ప్రజల మద్దతుతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. సభకు భారీగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి, తమ వెంటే లక్షలాది కార్యకర్తలు ఉన్నారని పేర్కొన్నారు.



## రామకృష్ణారెడ్డి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి . మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు, స్థానిక అధ్యక్షుడు స్వర్గీయ రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, పరమపదించిన విషయం తెలిసి, వారి నివాసానికి వెళ్లి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆయన చిత్రపటానికి పుష్పగుచ్ఛం సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు ఇటీవల , మరణించిన రామకృష్ణారెడ్డి తల్లిదండ్రులు, సతీమణి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, "రామకృష్ణారెడ్డి,పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబానికి ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని దేవుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు,

### కాంగ్రెస్ నేతల ఘాటు విమర్శలు

### ఇబ్రహీంపట్నంలో రాజకీయ వేడి: అభివృద్ధిపై ఆరోపణలు, ప్రత్యారోపణలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 21:-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ప్రశాంత్ కుమార్ రెడ్డిలు ప్రస్తుత ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అనుచితమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఒక మున్సిపాలిటీ చైర్మన్ సీటు కోల్పోయినంత మాత్రాన అహంకారపూరితంగా మాట్లాడటం సిగ్గుచేటని వారు వ్యాఖ్యానించారు.ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భూపతి గల్ల మహిపాల్, నీళ్ల భాను బాబు గౌడ్, బైరిక రమాకాంత్ రెడ్డి తదితరులుమాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రూ.18 కోట్లతో చెరువుల సుందరీకరణ పనులు చేపట్టామని, అయితే గతంలో భారీ మొత్తంలో మట్టిని అక్రమంగా విక్రయించి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు.
ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం జెడ్పిటిసిగా పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ గత పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతుండటాన్ని తట్టుకోలేక ప్రత్యర్థులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.
ఫార్మాసిటీ భూముల వ్యవహారంపై కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. 2016లో బినామీ పేర్లతో భూములు కాజేశారని ఆరోపిస్తూ, అక్రమాలపై సవాళ్లు విసురుతున్న వారికి స్పందించాల్సిన అవసరం ఎమ్మెల్యేకు లేదన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం మాత్రమే ప్రజాభిమానానికి కొలమానం కాదని, ప్రజాస్వామ్యంలో ఓటమిని కూడా అంగీకరించాల్సిందేనని సూచించారు.
ప్రస్తుత ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అభివృద్ధి పనులు చేపడుతుండగా, గతంలో జరిగిన తప్పిదాలను దాచిపెట్టేందుకు విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం రాజకీయాలకు మేలు చేయదని ప్రశాంత్ కుమార్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.
రాబోయే జూలైలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే సామర్థ్యం తమకే ఉందని నేతలు ధీమా వ్యక్తం చేశారు. గత 15 ఏళ్ల పాలనలో భూముల వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని, ఆక్టోపస్ భూములు, ఫార్మాసిటీ భూములను విక్రయించి లాభాలు పొందారని ఆరోపించారు.
లోయపల్లి ప్రాంతంలో సుమారు 200 ఎకరాల భూములపై కూడా కన్నేసి అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు, ఆరోపణలు కొనసాగితే సహించబోమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.
ఈ సమావేశంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

**-ఉపాధ్యాయులపై వేధింపులు ఆపేలా**
**జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి.**
**-గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్.**



చిలకలూరిపేట కార్పొరేట్ ,ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్.
ఆరోపించారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఈ ఒత్తిడిని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం జూన్ నెలలో మాత్రమే 'అడ్మిషన్లు ప్రారంభించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా కొన్ని పాఠశాలలు గత ఏడాది డిసెంబర్ నుంచే ముందస్తు అడ్మిషన్లు చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిరోజు పాఠశాలల సమయం ముగిసిన తర్వాత ఉపాధ్యాయులను ఇంటింటికీ పంపిస్తూ ఆడ్మి షన్ల కోసం ప్రచారం చేయిస్తున్నారని, వారికి టార్గెట్లు విధించి ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. టార్గెట్లు పూర్తి చేయకపోతే జీతాలు నిలిపివే యడం, ఉద్యోగం తీసేస్తామని బెదిరించడం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా విద్యా శాఖ అధికారులు దృష్టి సారించి ముందస్తు అడ్మిషన్లు నిలిపివేయాలని, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెలవు రోజుల్లో పూర్తి జీత భత్యాలు చెల్లించాలనే నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ విధంగా జిల్లా శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని శ్రీను నాయక్ హెచ్చరించారు.

## తడకల యాదయ్యకు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ : మహేశ్వరం ప్రతినిధి
మహేశ్వరం మండలం సిరిగిరిపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తడకల యాదయ్య, గత కొంతకాలంగా అనారోగ్యం బాధపడుతూ మృతి చెందారు, తడకల యాదయ్య సిరిగిరి పురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా మండల పార్టీ ఎస్సీ అధ్యక్షునిగా దళిత నాయకుడిగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారు,ఒక మంచి నాయకున్ని కోల్పోయామని పలువురు, నాయకులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు గదగూటి జంగయ్య ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా. సిరిగిరిపురం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇంద్రకంటి వెంకటేష్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు చిట్టెమల్లేష్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం 10వ వార్డు ఇన్చార్జి కాకి మల్లేష్ ముదిరాజ్, నాయకులు గగనం ఆంజనేయులు, తదితరులు నివాళులర్పించారు.





## ఫీజు రియంబర్స్ మెంట్ ఎత్తివేసే కుట్ర మానుకోవాలి

### -తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ

హైదరాబాద్, ఏప్రిల్ 21: విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ ఎత్తివేసే కుట్రను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో విద్యార్థి నేతలు సంజయ్ (ఓయు), ఉమేష్ (వెటర్నిటి), వంశీ (అగ్రికల్చర్) పాపారావు (తెలంగాణ), మహేందర్ (కాకతీయ), అజయ్ (నిజాం), రాకేష్ (సెంట్రల్ యూనివర్సిటీ) తో కలిసి ఆయన మాట్లాడుతూ... ఫీజులు కట్టలేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, మానసిక వేదనకు గురవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని. విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని అంటున్నాయని, ఇటు కాలేజీ యాజమాన్యల ఒత్తిడి, అటు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మధ్య పేద విద్యార్థుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు జీతాలు ప్రతి నెలా వేల కోట్లు మంజూరవుతున్నా, విద్యార్థుల పీజు రియంబర్స్ మెంట్ బిల్లులు మాత్రం మంజూరు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తిరగబడితే ప్రభుత్వాలే కూలిపోయే పరిస్థితి ఉంటుందని ఆ పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి రాకూడదని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఫీజు రియంబర్స్ మెంట్ చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే విద్యార్థి ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు

## హిమాయత్ నగర్ లో ఎమ్మెల్యే పాదయాత్ర



హిమాయత్ నగర్, ఏప్రిల్ 21:
ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం హిమాయత్ నగర్ డివిజన్ లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వీధి దీపాలు వెలగడం లేదని, మంచినీరు నల్లాల్లో సరిగ్గా రావడం లేదని, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. గుంతలు పడ్డ రోడ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్ల మర్మతు పనులు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయవద్దని, సమస్యలను పరిష్కరించే విధంగా తగుచర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో హిమాయత్ నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్ డాక్టర్ గణేష్ గౌటే, బీజేపీ నాయకులు నర్సింగ్ గౌడ్, కాంగ్రెస్ నేతలు రాజేంద్రప్రసాద్, అనీష్ గంగపుత్ర, ప్రభాకర్ గౌడ్, యాదగిరి, భాను, తదితరులు పాల్గొన్నారు.

# కర్నె అరవింద్ దశదిన కర్మలో బీఆర్ఎస్ నేతల ఘన నివాళులు





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 21:-
ఇబ్రహీంపట్నం, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, ఉద్యమకారుడు కర్నె అరవింద్ దశదిన కర్మ కార్యక్రమం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పార్టీకి చెందిన పలువురు ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై అరవింద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ, కర్నె అరవింద్ పార్టీకి అంకితభావంతో పనిచేసిన నాయకుడని, ఉద్యమ కాలం నుండి పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, అరవింద్ సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయన చూపిన మార్గంలోనే పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి కూడా మాట్లాడుతూ, అరవింద్ అకాల మరణం బాధాకరమని, ఆయన సేవలను స్మరించుకున్నారు. కర్నె ప్రభాకర్ కుటుంబానికి చెందిన అరవింద్, యువ నాయకుడిగా నియోజకవర్గంలో మంచి గుర్తింపు పొందారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆయనకు స్థానికంగా మంచి ఆదరణ ఉండేది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అరవింద్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.



# మహేశ్వరంలో మేడే పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 2:-
మహేశ్వరం మండల్ కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి దత్తు నాయక్, ఆవిష్కరించి, ఈ సందర్భంగా దత్తు నాయక్ మాట్లాడుతూ 141 వ మేడే మహేశ్వరం నియోజకవర్గ పారిశ్రామిక ప్రాంతాలలో పెద్ద ఎత్తున ర్యాలీలు, జెండా ఆవిష్కరణలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం, మహిళా కార్మికులకు రక్షణ, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇలాంటి అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలు రక్షించుకోవాలని కార్మిక వర్గానికి కోరడం జరిగింది, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను కార్మికులందరూ రద్దు అయ్యేంతవరకు సంఘటితంగా పోరాడాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మ గళ్ళ రాజు బ్రహ్మచారి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోటేష్, శ్రీశైలం, యాదయ్య, లింగం, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లలో నివసించని లబ్దిదారులపై చర్యలు, - కలెక్టర్ హెచ్చరిక



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 21:-
రంగారెడ్డి జిల్లా:డబుల్ బెడ్‌రూమ్ (2BHK) ఇండ్లు పొందిన లబ్దిదారులు తప్పనిసరిగా తమకు కేటాయించిన ఇండ్లలో నివసించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఇండ్లు కేటాయించుకొని వాటిలో నివసించని వారికి నోటీసులు జారీ చేసి, తగిన వివరణ లేకపోతే కేటాయింపులను రద్దు చేసి కొత్త అర్హులైన వారికి ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పూర్తయిన మరియు నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను ఎంపిక చేసిన లబ్దిదారులకు త్వరితగతిన కేటాయించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని, సంబంధిత ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్-2 జాబితా నుంచి అర్హులైన పేదవారిని ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఇండ్లు పొందిన వారు వాటిలో నివసించకుండా ఉంటే వెంటనే అక్కడే నివాసం ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని తెలిపారు. లేకపోతే ఆ ఇండ్లను రద్దు చేసి కొత్త లబ్దిదారులకు కేటాయిస్తామని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేసి, పరస్పర సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె. శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి. చాంప్లా నాయక్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతు పేరు నమోదు చేయించుకోండి, పథకాల లబ్ధిని పొందండి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 21:-
రంగారెడ్డి జిల్లా, వ్యాప్తంగా ఉన్న రైతులంతా తప్పనిసరిగా రైతు పేరును నమోదు చేయించుకుని నమోదు గుర్తింపు సంఖ్య పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి డి. ఉష సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధి సులభంగా అందుకోవడానికి ఈ నమోదు ప్రక్రియ ఎంతో కీలకమని పేర్కొన్నారు. రైతులకు బీమా, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు నమోదు అవసరమని తెలిపారు. అలాగే పత్తి, వరి కొనుగోలు, పంట రుణాలు పొందడంలో నమోదు ముఖ్య పాత్ర పోషిస్తుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా రైతుల ఖాతాల్లోకి చేరేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పెంచడానికీ ఈ నమోదు సహకరిస్తుందని పేర్కొన్నారు.
నమోదు కోసం ఆధార్ కార్డు, భూమి పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ అవసరమని తెలిపారు. రైతులు తమ గ్రామ పరిధిలోని రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి లేదా సమీప మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చని సూచించారు.
ఏప్రిల్ 22 నుండి 30 వరకు ప్రత్యేకంగా నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

# కవిత నూతన రాజకీయ ప్రస్థానానికి మద్దతుగా భారీ బైక్ ర్యాలీ

## -సాగర్ హైవేపై వంద బైక్‌లతో హోరెత్తిన యువత

## -25న జరగబోయే మేడ్చల్ సభకు భారీగా తరలిరావాలని పిలుపు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 21:-
ఇబ్రహీంపట్నం, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ నెల 25న మేడ్చల్ వేదికగా ప్రకటించనున్న నూతన రాజకీయ పార్టీకి మద్దతుగా రంగారెడ్డి జిల్లాలో రాజకీయ చైతన్యం వెల్లువెత్తింది. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.
మంచిరెడ్డి విజయ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మాల్ గ్రామం నుండి సాగర్ హైవే మీదుగా నియోజకవర్గ కేంద్రం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో సుమారు వంద బైక్‌లతో యువకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీతో సాగర్ హైవే ప్రాంతం నినాదాలతో మారుమోగింది.
ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవిత పాత్ర చిరస్మరణీయమని తెలిపారు. అమరుల ఆశయాలను సాధించే దిశగా సంపూర్ణ తెలంగాణ వికాసమే లక్ష్యంగా కవిత రాజకీయ ప్రస్థానం కొనసాగనుందని పేర్కొన్నారు. రాజకీయ మార్పుకు నాంది పలుకుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సరికొత్త రాజకీయ పంథాను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి, జిల్లా యువజన విభాగం నాయకుడు కర్నాటి చంద్రకాంత్ మాట్లాడుతూ, ఈ నెల 25న మేడ్చల్‌లో జరిగే మహాసభకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి యువకులు, మహిళలు, మేధావులు, రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కవిత అడుగుజాడల్లో నడవడానికి సిద్ధమంటూ యువత చేసిన నినాదాలతో ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగింది. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ జరిగిన ఈ కార్యక్రమంలో



కంబాలపల్లి చెన్నకిషన్ రెడ్డి, బట్టు దినేష్ రెడ్డి, ఎన్ నవీన్, బి. ప్రవీణ్ రెడ్డి, రాయకంటి జగన్ తదితరులు పాల్గొన్నారు

# కష్టసమయంలో తోడుగా మడుపు వేణుగోపాలరావు, ఆటో డ్రైవర్ కుటుంబానికి చేయూత

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 21:-
రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని సీతారంపేట్‌కు చెందిన ఆటో యూనియన్ అసోసియేషన్ సభ్యుడు అనిల్ తల్లి స్వర్గస్తులైన నేపథ్యంలో, ఆయన కుటుంబానికి చేయూతగా నవ్య ఫౌండేషన్ కార్యదర్శి మడుపు వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.
సహచరుడి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం మానవత్వానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని ఆటో యూనియన్ సభ్యులు మడుపు వేణుగోపాల్ ని కొనియాడారు. ఈ సందర్భంగా మడుపు వేణుగోపాల్ రావు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు సమాజానికి ముఖ్యమైన సేవ అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ కష్టపడి జీవనోపాధి సాగిస్తున్న డ్రైవర్లు పరస్పరం సహకారం, ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి కష్టసమయంలోనైనా ఒకరికొకరు తోడుగా నిలిస్తే సమస్యలను సులభంగా ఎదుర్కొనవచ్చని తెలిపారు. డ్రైవర్లు తమ ఆరోగ్యం, భద్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.
ఈ కార్యక్రమంలో జెలమోని రవీందర్, ఎఖఔజీ(ఎ-143) యూనియన్ అధ్యక్షులు సూరమోని సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ పల్లపు విజయ్, ఆటో యూనియన్ సభ్యులు ప్రదీప్ రెడ్డి, భాస్కర్, సురేష్, సుధాకర్, తుకారం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డలకు వరం 'కళ్యాణలక్ష్మి'

## సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు

హైదరాబాద్, ఏప్రిల్ 21: ఆడబిడ్డల పెళ్లి ఆ కుటుంబానికి ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తూ ఆర్థికంగా కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటోందని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యాసభ సభ్యులు వి. హనుమంతరావు అన్నారు. మంగళవారం అంబర్ పేట నియోజకవర్గంలో 400 మంది లబ్దిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్ లను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, కాంగ్రెస్ నేతలు రోహిన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోత రోహిత్ లతో కలిసి ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాల కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు మాట్లాడుతూ.... ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాల్లో కళ్యాణ లక్ష్మీతో కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగు నింపుతుందని అన్నారు. అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న పేదల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆహర్నిశలు పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



